

Unique Telugu Novelist Whose English Novel
**"THE ENEMY OF MANKIND"**
Has Been Published in USA and Released Worldwide

# సూర్యదేవర రామ్ మోహన రావు

**Author of Highest Number of Novels In Telugu**



# ప్రేమకప్పులో చిరుతుఫాన్

సూర్యదేవర
రామ్మోహనరావు

# ప్రేమకప్పులో
# చిరుతుఫాన్

మధుప్రియ

# ప్రేమ కప్పులో తుఫాను

## -సూర్యదేవర రామ్‌మోహనరావు

(కొత్త సీరియల్ ప్రారంభం)

హైదరాబాద్ కింగ్ కోటిలో హైలేన్ హోటల్ ముందు పొడవాటి లాన్సర్ కారు రివ్వున వచ్చి ఆగింది....

ఇరవై లక్షలకుపైగా ఖరీదు చేసే ఆ కారు అద్దె ఒక రోజుకు ఐదువేలు.....

కారులోంచి హుందాగా దిగాడు నిశాంత్.

అతడితోపాటు మామూలు హైట్‌తో, మామూలు రంగు వున్నా, రజినీకాంత్ స్టయిల్‌లో దిగాడు నారాయణ. అతను విశాంత్‌కి నిక్కర్ ఫ్రెండ్.

గోవా వెళ్ళాక ఆడి కారు కొనాలని నిర్ణయించుకున్నాడు నిశాంత్.

నిర్ణయాలు తీసుకోవడంలో అతడు బిల్‌గ్రేట్స్ అంత ఫాస్ట్ అని ఫ్రెండ్స్ అంటుంటారు.

ఇంటర్ మొదటి ఏడే అందమైన అమ్మాయిని ప్రేమలో పడేసినంత హాయిగా వుంది ఆడి ప్రయాణం.

అందుకే విశాంత్ ఆ నిర్ణయం తీసుకున్నాడు.

హోటల్ లోపలికి విశాంత్, నారాయణతోపాటుగా డ్రైవర్ కూడా నడిచాడు.

'మనుషులంతా ఒక్కటే' అని స్టేజ్‌పై బి.పి. వచ్చి పడిపోయేంతగా అరచి, ఇంట్లో పనివాళ్ళను కుక్కలకన్నా హీనంగా చూసే మైకాసురులకు భిన్నంగా, ప్రాక్టికల్‌గా ఆలోచిస్తూ, అంతర్లీనంగా హ్యూమనిజం చూపెడ్తాడు నిశాంత్.

× × ×

"తీన్ హలీమ్...." చెప్పాడు డ్రైవర్.

రంజాన్ ఉపవాసపు రోజులప్పుడు హైదరాబాద్‌లో ప్రతి సాయంత్రం హలీమ్ వంటి వంటకాలు అన్ని మతస్థుల వారినీ ఆకట్టుకుంటాయి.

గోధుమలు, మాంసంతో చేసే హలీమ్ తిన్నాకే గోవా వెళ్ళాలని నిశాంత్ అనడంతో–

కాచీగూడా రైల్వేస్టేషన్ వైపు వెళుతున్న వారి ప్రయాణానికి కాసేపు బ్రేక్ పడింది.

ఐదు నిమిషాల తరువాత ముగ్గురి ముందు మూడు ప్లేట్లలో హలీమ్ ప్రత్యక్షమయింది.

నిమ్మకాయ పిండుకుని ముగ్గురూ తినసాగారు.

"నిశాంత్! నాగార్జునసాగర్ వద్ద ఎత్తిపోతల జలపాతం ప్రాంతంలో మంచి లైటింగ్ ఏర్పాట్లు చేశారుగా, సాగర్‌లో స్టార్ హోటల్ కట్టాక, టూరిస్ట్‌ల సంఖ్య బాగా పెరుగుతోంది.

గోవాలోని అర్వలెమ్ గుహలు బౌద్ధ భిక్షువులు నిర్మించారని అంటారుగా.

సాగర్ వద్దకు కూడా బౌద్ధులు ఎక్కువగా వచ్చేలాగా– గోవా, ఆంధ్రా డైరెక్ట్ ఫ్లయిట్ ఏర్పాటు చేస్తే, గోవా లాగానే ఆంధ్రా కూడా టూరిస్ట్‌లతో కళకళలాడుతోంది... కదూ?" అడిగాడు నారాయణ.

"నిజమే! టూరిస్ట్ సెక్టార్, ఐ.టి., బయోటెక్నాలజీల కంటే ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తుంది.

అందుకే తెలంగాణ గవర్నమెంట్ టూరిజంపై ప్రత్యేక శ్రద్ధ ఎక్కువ పెడుతోంది. ఇది మన వ్యాపారానికి మంచిది" చెప్పాడు నిశాంత్.

"గోవా టూరిజం మంత్రి ఎలిస్‌బావ్ ఫోన్ చేయబట్టి మనకు చాలా కలిసివచ్చింది.

"ఫోన్ చేయకుండా ఎలా వుంటాడు....?

అసెంబ్లీ ఎన్నికలప్పుడు ప్లానింగ్, పబ్లిసిటీ ఐడియాలు నీవేగా–" చెప్పాడు నారాయణ.

మళ్ళీ తనే అన్నాడు.

"అన్నట్లు... ఉగ్రవాదులు కూడా ఈ హలీమ్ లాంటివే తింటుండాలి.

లేకపోతే సౌకర్యాలు లేనిచోట్ల శక్తిని పొందాలంటే మాటలా?"

ఉగ్రవాదులు పేరు వినగానే డ్రైవర్ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు.

అసలే హైదరాబాద్‌లో బాంబుల గోల... ఈ టైంలో టెర్రరిస్టుల పేర్లెత్తితే పోలీసులు ఎన్‌కౌంటర్ చేసి పడేస్తారు.

"అది సరే....

ఆ మరచెంబుని మాత్రం వదలవా?" నిశాంత్ చిరునవ్వుతో ప్రశ్నించాడు.

"మరచెంబా.... మజాకా.... ఈ కాలం వారికి మినరల్ బాటిల్స్ పట్టుకోవటం స్టయిలయిపోయింది.

అసలు మరచెంబుల వల్ల డబ్బెంత కల్సివస్తుందో తెల్సా? ఎంతైనా పాతకాలమే బెస్టు.... కొత్తదంతా వేస్టు..." జవాబిచ్చాడు నారాయణ.

అందరికంటే కాస్త భిన్నంగా వుండాలని నారాయణ ప్రయత్నిస్తుంటాడు.

దాన్ని అతడు వెరైటీ, జీనియస్ అని అంటాడు. అది గుర్తింపు రాహిత్యం వల్ల వచ్చిన జబ్బని నిశాంత్ అంటాడు.

ముగ్గురూ హలీమ్ తిన్నాక ఇరానీ ఛాయ్ తాగారు.

"రైలు బయలుదేరడానికి అరగంటే వుంది...." అంటూ లేచాడు నిశాంత్.

వారితోపాటే పక్క టేబుల్ నుంచి లేచిన సి.ఐ.డి. పోలీస్ వాకీటాకీలో ఏదో మాట్లాడసాగాడు.

× × ×

కాచిగూడా రైల్వేస్టేషన్....

సమయం రాత్రి పదీ.... పది....

ప్రశాంతి నిలయం మరియు వాస్కో-డ-గామా వెళ్ళే ఎక్స్‌ప్రెస్ ఇంకా ఎందుకు బయలుదేరడంలేదో రైల్లోని ప్రయాణికులకు అర్థంకావడం లేదు.

నిశాంత్, నారాయణలను అనుమానంతో ఫాలో అయిన సి.ఐ.డి. పోలీస్‌కి విషయం అర్థంగాక బుర్ర గోక్కుంటున్నాడు. అసలే అతడికి బట్టతల.

ఇలాంటి అనుమానాలతో బుర్ర గోక్కుంటే ఉన్న శాంపిల్ వెంట్రుకలు కూడా వూడిపోతాయనే భయం మరోపక్క అతడ్ని పీడిస్తోంది.

ఆడి కారు.....

ఒకడి చేతిలో మరచెంబు.

ఇద్దరూ సెకండ్ క్లాస్ స్లీపర్ కోచ్‌లోకి ఎక్కడం. ఏదీ తర్కానికి అందక అతడు టెన్షన్ పడుతున్నాడు.

స్లీపర్ క్లాస్‌లో కిటికీ పక్కన మరచెంబు పెట్టి నారాయణ నిశాంత్‌తో అంటున్నాడు.

"నిశాంత్! ముంబై మీదుగా గోవా వెళ్ళాల్సింది. సరే.... నీకు రైలు ప్రయాణం అంటే ఇష్టం. కనీసం త్రీ టైర్ ఏ.సి.లో వెళ్ళేవాళ్ళం కదా?"

"నారాయణ! ఏ.సి.ల్లో బిక్కుబిక్కుమంటూ వెళితే ఏం మజా.... ఇలా సెకండ్ క్లాస్‌లోనే జర్నీ భలే ఉంటుంది. ఎక్కువ మందిని స్టడీ చేయొచ్చు కూడా....

అది సరే, నీ మరచెంబు ఎపిసోడ్ ఎంతమంది ఆసక్తిగా చూశారో!" అన్నాడు నిశాంత్.

సరిగ్గా అప్పుడే మైక్‌లో ఓ అనౌన్స్‌మెంట్ వినిపించింది. రైల్లోని ప్రయాణీకులంతా కిందకు దిగాలని చెప్పారు.

ఐదు నిమిషాలు గడిచాయి.

ప్లాట్‌ఫారం అంతా పోలీసులతో నిండిపోయింది.

బాంబ్‌స్క్వాడ్ వారు భోగీల్లో అణువణువూ శోధిస్తున్నారు.

నిశాంత్ వాళ్ళని ఫాలో అయిన సి.ఐ.డి. పోలీస్ భోగీలోని మరచెంబు విషయం చెప్పాడు.

అంతే....

బాంబ్‌స్క్వాడ్ వారు దాన్ని ప్లాట్‌ఫారం మీదకు తెచ్చి, జాగ్రత్తగా తెరవసాగారు.

అందరి ముఖాల్లో ఉత్కంఠ.....

నారాయణ ఏదో చెప్పబోయేలోగా.... మరచెంబు మూతని పూర్తిగా తీసారు.

లోపల నీళ్ళు....

'ఈ నీళ్ళ కోసమేగా తమిళనాడు, కర్ణాటక, తెలంగాణా, ఆంధ్రా కొట్టుకుంటున్నది' అనుకున్నాడో పోలీస్ అధికారి.

సి.ఐ.డి. పోలీస్ ముఖం పాలిపోయింది.

"ఢిల్లీలో టిఫిన్ బాక్స్‌ల్లో బాంబులు పెట్టేవారు. అందుకే మరచెంబు మీద డౌటొచ్చింది" చెప్పాడా అధికారి నారాయణతో.

"ఇదెక్కడి గోడవరా బాబూ! గోవానే నయం.... ప్రశాంతంగా వుంటుంది" సగం నవ్వుతో అన్నాడు.

"వెరైటీ.....వెరైటీ.... అంటే ఏదో రోజా హౌస్ మునుగుద్దీ" నవ్వుతూ అన్నాడు నిశాంత్.

రాత్రి పదకొండుకు ఎక్స్‌ప్రెస్ ట్రైన్ ఎట్టకేలకు బయలుదేరడంతో అందరూ ఆక్సిజన్ పీల్చుకున్నారు.

× × ×

వర్షిణి తన తల్లికి వంటల్లో సాయం చేస్తుండగా పోస్ట్‌మేన్ కొడుకు డేవిడ్ పిలుపుతో బయటకు వచ్చింది.

అతడి చేతిలోని తనకొచ్చిన లెటర్ వకం ఆశ్చర్యంగా చూసింది.

"నిశాంత్ సార్ నుండి వర్షిణీ! అయనిప్పుడు నాకు బాస్.... ప్లస్ టూ పరీక్షలయ్యాక, పార్ట్‌టైంగా సన్ అండ్ శాండ్ హోటల్‌లో చేరుతున్నాను. నిశాంత్‌గారి రాకతో మన ఊరికి నిరుద్యోగ ప్రాబ్లమ్ పోయినట్లే" చెప్పాడు డేవిడ్.

అతడికి వర్షిణితో మాట్లాడాలంటే చాలా ఇష్టం.

తనకంటే కాస్త పెద్దదయినా, వర్షిణి సౌందర్యాన్ని చూస్తే సినిమాల్లో హీరోయిన్‌ని చూడక్కర్లేదని అతడి భావం.

మల్లెపూలని మిక్సీలోవేసి, ఆ ముద్దకు ప్రాణం పోస్తే వర్షిణీ అయిందని మనసులో అనుకున్నాడు.

గోవా రమణీయ అందాలన్నిటికీ ఒకటే పదం కాయిన్‌చేసి చెప్పాలంటే వర్షిణీ అని చెబుతాడు డేవిడ్.

అతడి చేతులోంచి లెటర్ తీసుకుంది వర్షిణి.

హేండ్‌మేడ్ పేపర్‌తో చేసిన లెటర్ చూసి, నిశాంత్‌దీ మంచి టేస్టే....! అనుకుంది వర్షిణి.

కుతూహలంగా లెటర్‌ని చదవసాగింది.

డియర్ మిస్ వర్షిణీ.....

మీరు గతంలో చేసిన సెక్రటరీ జాబ్ మళ్ళీ మిమ్మల్నే వరించింది. క్రిస్మస్ లోపల మా సన్ అండ్ శాండ్ హోటల్ ప్రారంభిస్తున్నాం. ఇక్కడి సంగతులు మీకు తెలిసే వుంటాయి.

నిర్మాణ దశలోనూ మీ హెల్ప్ అవసరం. ఏ సంగతీ రెండు రోజుల్లో నా మొబైల్‌కి ఫోన్ చేయండి.

నా నెంబర్ 9848999999

ఇట్లు<br>
నిశాంత్.<br>
ఎం.డి.

సూర్యా హొటల్స్ ప్రై.లిమిటెడ్ (గోవా).

“ఏం ఉత్తరం” అడిగింది లక్ష్మీదేవి. ఆమె వయసు ఏభై దాటినా, పదేళ్ళు తక్కువగా కనబడుతుంది.

ఆమెకి యిద్దరు ఎదిగొచ్చిన కూతుర్లున్నారంటే చాలామంది నమ్మరు.

“అదే... సన్ అండ్ శాండ్ హొటల్‌వారి నుంచి” బదులిచ్చింది వర్షిణి. ఒకచేత్తో చిరుచెమటను తుడుచుకుంటూ డేవిడ్ వైపు చూసింది.

“వర్షిణీ! తప్పకుండా జాబ్‌లో చేరు” అని డేవిడ్ అక్కడ్నించి వెళ్ళిపోయాడు.

డేవిడ్ చూపుల్లో తేడా వుందే అని ఆలోచిస్తూ లోపలికి నడిచింది వర్షిణి.

లోపల సోఫాలో కూర్చుని టి.వి.లో డిస్కవరీ ఛానల్ చూస్తోంది నయనతార.

‘ఎం. టి.వి. చూడాల్సిన వయసులో, మరీ ఇలాంటి ఛానల్స్ చూడాల్సివస్తోంది’ అని నయనతార గురించి వర్షిణి అనుకుంది స్వగతంలా.

వర్షిణి తల్లిదండ్రులు ఇక పిల్లలు పుట్టరేమో అని నయనతారని ఒక అనాధ ఆశ్రమం నుండి దత్తత తీసుకున్నారు. అయితే రెండేళ్ళకే వర్షిణి పుట్టడం జరిగింది.

ఇద్దరికీ తేడాలు లేకుండా పెంచారు. నయనతారకి కూడా చెల్లెలంటే ప్రాణం.

ఇద్దరూ కనుక అందాల పోటీలో పాల్గొంటే ఎవరికి మొదటి ప్రైజు, ఎవరికి రెండో ప్రైజు ఇవ్వాలో తెలీక న్యాయ నిర్ణేతలు కొట్టుకు చావడం ఖాయమని తెలిసిన వాళ్ళు జోకుతుంటారు.

అయితే....

వర్షిణికి అందమైన రూపంతోపాటు, అంతకంటే అందమైన మనసూ వుందని దగ్గరి వాళ్ళకే తెలుసు.

“ఏదో జాబ్ పిలిచి యిస్తున్నారంట.... అదృష్టం కాలింగ్ బెల్ నొక్కడమంటే ఇదేనేమో?” నవ్వుతూ అంది నయనతార.

తనూ నవ్వి టి.వి. చూడసాగింది వర్షిణి.

టి.వి.లో నేషనల్ జాగ్రఫికల్ ఛానల్‌లో పులులు ప్రేమ సరాగాలు చూశాక, కాస్త ఇబ్బందిగా కదిలింది నయనతార.

భర్త యువరాజ్‌తో గడిపిన హనీమూన్, ఆ తరువాత మధుర రాత్రులు.....

ఇక తన జీవితం ఎడారేనా.....?

లేక ఎడారిన ఓయాసిస్ వుంటుందా....?

లేక ఎడారిలోనూ పంటలు పండించే ఇజ్రాయిల్‌లా ఉంటుందా.....?

తన జీవితమే కాదు.... మనసు సరిగ్గా అర్థంకావడం లేదు నయనతారకి.

× × ×

సాయంత్రం ఆరుబయట గార్డెన్‌లో కూర్చున్నాడు నిశాంత్.

సరిగ్గా అప్పుడే వచ్చాడు నారాయణ. చేతిలో రెండు కొబ్బరి బొండాలు వున్నాయి.

మరో చేతిలో లంక పొగాకు చుట్ట వుంది.

"చుట్టేంటిరా బాబూ....?"

"చుట్ట కాదు.... సిగార్.... ఇంగ్లీష్ సినిమాల్లో రాబర్ట్‌డీనీరోలా, రజినీకాంత్‌లా ఇదో స్టయిల్."

"నీకు చెప్పినా ఒకటే.... దోమల సమస్యల గురించి మన ఎం.పి.కి చెప్పినా ఒక్కటే.... చెవిటివాని ముందు శంఖం ఊదినట్లే. రైలింజన్ హారన్ ముందు విజిల్ వేసినట్లే.... ఇంతకీ మధ్యాహ్నం నుంచీ కనపడలేదే?"

"ఓహ్.... అదా! అదో నారాయణ ఏక్-లవ్-స్టోరీ. సరే రూంలో ఓడ్కా వుందా?" ప్రశ్నించాడు నారాయణ.

నిశాంత్ రూంలోకి వెళ్ళి స్మిర్నాఫ్ ఓడ్కా బాటిల్ తెచ్చాడు.

కొబ్బరి బొండాలలో చెరో పెగ్ వేశాడు....

ఇద్దరూ సిప్ చేస్తుంటే నారాయణ ఫ్లాష్‌బ్యాక్‌లోకి జారాడు.

× × ×

కెలంగూట్ బీచ్.....

ఎటుచూసినా అర్ధనగ్నంగా ఫారినర్స్....

బీచ్ ఒడ్డున ఇసుక తిన్నెలపై టవళ్ళు పర్చుకున్న అందమయిన భామలవంక చూశాడు నారాయణ.

ఎప్పటికైనా ఫారినర్‌ని పెళ్ళి చేసుకోవాలని అతడి చిరకాల వాంఛ.....

అసలు ఫారిన్ అమ్మాయిలంత సొగసు, ఎరుపు ఛాయ, బలిష్టమైన శరీరాలు మనవాళ్ళకి వుండవని అతడి అభిప్రాయం.

అందులో కొంత నిజం వున్నా, అతడిలాంటి పర్సనాల్టీలు ఫారిన్‌లో వుంటాయా? అని నిశాంత్ ప్రశ్నార్థకం.

ఇండియన్ బ్యూటీ ముందు ఎవరైనా దిగదుడుపే అని నిశాంత్ అంటాడు.

ఈరోజు ఎలాగైనా ఫారిన్ అమ్మాయిని టచ్ చేయాలని ఒట్టేసుకున్నాడు నారాయణ.

అందులో బ్రహ్మాండమైన ఐడియా నారాయణకు వచ్చింది.

గతంలో కెలంగూట్ బీచ్‌కి వచ్చినప్పుడల్లా చేతిలో సీసాలు పట్టుకుని మాలిష్‌చేసే మళయాళీలను చూసేవాడు.

ఇప్పుడు నారాయణ కూడా గళ్ళలుంగీ, టీ షర్ట్, చేతిలో మందుల షాపులో కొన్న మసాజ్ ఆయిల్‌తో బీచ్ ఒడ్డున నడవసాగాడు.

ఒకచోట అకస్మాత్తుగా ఆగాడు.

కాస్త దూరంలో టవల్‌పై ఎర్రటి లోదుస్తులతో ఓ విదేశీ అమ్మాయి ఎండస్నానం చేస్తోంది.

ఆమె అవయవ సంపదలు చూడగానే నారాయణకు మతిపోయింది.

ఆమె దగ్గరకు వెళ్ళి–

"మాడమ్! కేరళ ఆయుర్వేద మసాజ్" అని ఫారినర్స్ ఉచ్ఛారణలో అన్నాడు.

మేడమ్ బదుల మాడామ్ అని ఒత్తిపలకాలని కొందరు మాలిష్ కుర్రాళ్ళను సీక్రెట్‌గా ఫాలో అయి నేర్చుకున్నాడు.

ఆ అమ్మాయి మాలిష్‌కి ఒప్పుకోవడంతో....

"ఆహా! ఏమి భాగ్యమూ.... ఎంత స్వర్గము..... ఇన్నాళ్ళకి మాలిష్ పేర ఫారిన్ అమ్మాయి ఒళ్ళంతా తడమడం.....

ఆమెకి తన చేతివాటం నచ్చి, హొటల్‌కి పిలవడం, హొటల్‌లో ఏ.సి. రూంలో మెత్తటి పరుపుపై యిద్దరం......!!!" కలలు కనసాగాడు నారాయణ.

అంతలో ఎదురుగా ఆరడుగుల విదేశీయుడు.

"నా బాయ్‌ఫ్రెండ్ లారా! బ్యాక్ పెయిన్ ఎన్నాళ్ళుగానో వుంది. ఆయుర్వేద మసాజ్ ద్వారా తగ్గుతుందేమో.....

ఆయనకి ఒక నెలరోజులు రోజూ హొటల్ లేదా బీచ్‌కొచ్చి మసాజ్ చేయగలరా?" అడిగిందా ఫారిన్ సౌందర్యవతి.

ఎలక్షన్లలో డిపాజిట్ కోల్పోయిన కాంగ్రెస్ మినిస్టర్‌లా ముఖం పెట్టాడు నారాయణ.

"అదీ జరిగింది..... 'ట్రై అండ్ ట్రై అంటిల్ యు డై....' అన్నారుగా. ఎప్పటికయినా ఫారినర్‌ని పెళ్ళి చేసుకుంటా" చెప్పాడు నారాయణ.

× × ×

ఆంధ్రాలో పెంకుటిల్లు మాదిరి గోవా శైలిలో చుట్టూ చెట్లతో సింపుల్‌గా వుందా ఇల్లు.

ఎదురుగా అరేబియా సముద్రం....

బీచ్‌లో ఎంతో ఎత్తు పెరిగిన కొబ్బరిచెట్లు.

ఆ ఇంటిని వర్షిణి తాతగారు కట్టించారు. ఆయన చేపల వ్యాపారం చేసేవారు.

ఆయన మరణించాక వర్షిణి తల్లి ఇంటికి ఏడాదికి ఒకసారి రంగులు మాత్రం వేయిస్తోంది.

ఇల్లు పాతదైనా అదంటే వర్షిణికి ప్రాణం.

ఇది నాది అన్న భావనకు ముందు బిల్‌గేట్స్ సంపద కూడా దిగదుడుపే......

తల్లితో వర్షిణికి చనువెక్కువ. తండ్రి మరణించాక అది మరీ ఎక్కువయింది.

అయితే ఆ యింట్లో వర్షిణికీ, నయనతారకీ తేడా చూపించేవారు కాదు.

నయనతార, వర్షిణికంటే ఐదేళ్ళు పెద్దదైనా ఎలాంటి అసూయలేకుండా వర్షిణిని చూసుకుంటుంది.

అక్కాచెల్లెలు అంటే ఎవరూ నమ్మరు. ఫ్రెండ్స్ అనుకుంటారు. బయట చూసి.

అందులోనూ అక్క నయనతార సొంత అక్క కాదని తెలిసి మరీ ఆశ్చర్యపోతుంటారు.

ఆ ఇంట్లో రెండు పెద్ద విషాదాలు జరిగాయి.

వర్షిణి తండ్రి నడివయసులోనే చనిపోవడం, నయనతారకు పెళ్ళయిన రెండేళ్ళకు వైధవ్యం ప్రాప్తించటం...

నయనతార భర్త యువరాజ్ మంచి అందగాడు. అతడ్ని తలమునకలుగా ప్రేమించింది నయనతార.

వాళ్ళిద్దరూ ఇంటర్మీడియట్ చదివే ప్రేమికుల్లా కలిసి తిరిగేవారు.

యువరాజ్ పడవ ప్రమాదంలో మరణించాక నయనతార ఇక కోలుకోలేకపోయింది.

ఏ విషయంపైనా ఆసక్తి చూపడం లేదు. ఒక రకంగా డిప్రెషన్‌తో నెర్వస్ బ్రేక్‌డౌన్‌కి దగ్గర్లో వుంది.

వర్షిణి తల్లి లక్ష్మీదేవి మాటలపై ధ్యాస పెట్టకుండా మొక్కుబడిగా టి.వి.లో కార్టూన్ నెట్‌వర్క్ చూస్తోంది.

"నిశాంత్‌ని కలుస్తావుగా?" లక్ష్మీదేవి అడిగింది.

"ఊ.....!" వర్షిణి బదులిచ్చింది.

× × ×

గోవాలోని వాస్కోడ-గామాలో సడా ప్రాంతానికి నిశాంత్ రాక స్థానికులకు నచ్చలేదు.

పోర్చుగీసు కాలంలో కట్టిన మర్మగోవా కోటను, హోటల్ నిమిత్తం ప్రభుత్వం లీజుకివ్వడం అస్సలు నచ్చలేదు.

కోట చూస్తే శిథిలమై వుంది.

కోటలోని రాళ్ళను ఇంటి నిర్మాణాలకు దొంగచాటుగా వాడుకున్నవారు కూడా హెరిటేజ్ సాకుతో కోటను అలాగే వుంచేయాలని ఆందోళనలు చేస్తున్నారు.

కోటలు చాలా భాగం మర్మగోవాట్రస్ట్ సంరక్షణలో వున్నాయి.

జపనీస్ గార్డెన్‌వేపు ఒక భవంతిని చిన్న హోటల్‌గా మార్చి గతంలో నడిపారు.

అందులో వర్షిణి పనిచేసింది.

ఆ హెూటల్‌ని కూల్చి, గోవా శైలిలోనే పెద్ద భవనాన్ని నిర్మించదలిచాడు నిశాంత్.

సి.ఆర్.జెడ్. (కోస్టల్ రెగ్యులేటరీ జోన్) కింద సముద్రతీరానికి 500 మీటర్ల వరకూ ఎలాంటి భారీ నిర్మాణాలు వుండకూడదు.

ఆ రూల్‌ని పాటించి, కొండపై తన సన్ అండ్ శాండ్ హెూటల్ నిర్మాణం ప్రారంభించాడు నిశాంత్.

బయటి వ్యక్తి అక్కడ హెూటల్ నిర్మించడానికి కూడా చాలామంది వ్యతిరేకత ప్రదర్శించారు.

ఆంధ్రా యువకుడు బాస్ కాబట్టి తెలుగు వాళ్ళకే ఉద్యోగాలు ఇస్తాడని, తమకేమీ దక్కవని వారి అనుమానం.

సన్ అండ్ శాండ్ హెూటల్ గురించిన వదంతులు, నిశాంత్ అందం గురించి ఆ నోటా, ఈ నోటా వర్షిణి కూడా వింది.

నిశాంత్ సాయంత్రాలు దాదాపు పది లక్షల ఖరీదుచేసే ఎలిమినేటర్ బైక్‌తో వాస్కో-డ-గామాలో షికార్లు చేస్తుంటాడని, అమ్మాయిలే అతడికి బ్రాడ్‌గేజ్‌లో లైన్‌లు వేసే రైల్వేవారికన్నా ఫాస్ట్‌గా, కొత్త రూట్లతో వేస్తున్నారని తెలుసుకుంది.

సన్ అండ్ శాండ్ నిర్మాణాల్లో స్థానికులకు ఉద్యోగాలు లభించాయి. అదిమాత్రం కొంతమందిని సంతోషపరిచింది.

సడాలో లోకల్ హీరోయిన్‌గా పేరుపడ్డ కాజోల్‌కి, పోస్ట్‌మాన్ భార్య మమతకు ఉద్యోగాలు లభించాయి.

తమ ప్రాంతానికి సన్ అండ్ శాండ్ మంచే జరుగుతుందని వర్షిణి అనుకుంది.

“కాజోల్ లాండ్రీ సర్వీస్‌లో చేరిందట. పొద్దున్న కలిసింది. పాత ఇస్త్రీపెట్టెల స్థానంలో మోడ్రన్ లాండ్రోమెట్స్ తెప్పించాడట నిశాంత్.

అఫ్‌కోర్స్! ఓల్డ్ స్టయిల్ బాగుంటుందనుకో” చెప్పింది వర్షిణి తల్లితో.

చిన్నగా నవ్వి వూరుకుంది లక్ష్మిదేవి.

తన కూతురు ఎంత ఉన్నత హృదయురాలో తెలుసు. అందరూ బాగుండాలని కోరుకునే రకం.

వర్షిణిని చూసి ఎంతో నేర్చుకోవాలని అనుకుంటూ వుంటుంది.

ఆరునెలల క్రితం ఉద్యోగం మానేశాక, కంప్యూటర్ నేర్చుకుంది వర్షిణి.

కాలం పెట్టే రన్నింగ్ రేస్‌లో నిత్యం పరుగెత్తలేకపోతే.... చతికిల పడిపోతామని ఆమెకు తెలుసు.

అందుకే టెక్నాలజీ వెంటనే అందిపుచ్చుకోవాలని ఆమె అంటూ వుంటుంది.

భర్తపోయాక నయనతార ఇంటిపట్టునే వుండడం, వర్షిణికి ఉద్యోగం లేకపోవడంతో, తన చేపల బిజినెస్ ద్వారానే ఆదాయాన్ని సమకూర్చుకోవలసి వస్తోంది.

ఇంటికి దూరంగా ఉద్యోగం చేయడం ఇష్టంలేదు వర్షిణికి. చిన్న నాటినుంచి సముద్రమంటే యిష్టం.

నేవీలో చేరుతానని అంటే తల్లి వద్దన్నందుకు ఇప్పటికీ కోపంగానే వుంటుంది.

నిశాంత్ వద్ద ఉద్యోగం చేయాలి అన్న నిశ్చయానికి రావడం వెనుక కారణం.....

తమ ఇంటి కప్పు వర్షాల్లో కారుతుండడం....

సమస్యలు చిన్నవే....

కానీ అర్థికబాధ పెట్టేది ఒకోసారి చాలా పెద్దది.

తను వేసుకునే పంజాబీడ్రెస్‌లు ఏడొందలుపైనే. ఇప్పుడు కొత్తది కొనాలంటే ఆలోచించాల్సి వస్తోంది.

మరి తల్లి పుట్టినరోజున తొమ్మిదిగజాల మరాఠీ పట్టుచీర కానుకగా యివ్వాలి.

తల్లిని, అక్కని ఊటికి తీసుకెళ్ళాలి.

ఇవన్నీ చేయాలంటే డబ్బు సంపాదించాలి. కాబట్టి నిశాంత్ వద్ద ఉద్యోగం చేయాలి అనుకుంది వర్షిణి.

× × ×

సాయంత్రం ఐదున్నర.....

నీట్‌గా డ్రెస్ చేసుకుని, రోడ్‌పైకి నడిచింది వర్షిణి. దారిలో మాంటీ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద ఆగింది.

లోపల్నించే విష్ చేశాడు మాంటీ.

అతడు చిరుగడ్డంతో అసలుసిసలు గోవన్‌లా వుంటాడు. యాభై ఏళ్ళు వచ్చినా పెళ్ళిచేసుకోలేదు.

బార్ కౌంటర్‌వద్ద కూర్చుని సాయంత్రాలు తనూ పెగ్ వేస్తుంటాడు.

లైఫ్ ఎంజాయ్ చేయడానికే వుంది.

“గతం అగ్నిపర్వతం..... తవ్వకు. భవిష్యత్తు అగమ్యం. మరవకు. వర్తమానంలో చావకు” ఇదీ టోటల్‌గా అతడి ఫిలాసఫీ..... కాదు కాఫీ అంటాడు నవ్వుతూ.

“వర్షిణీ! సన్ అండ్ శాండ్ వల్ల నా బార్ దెబ్బతింటుందా?” అడిగాడు.

“అది స్టార్ హొటల్ కదా! మీదేమో మీరు మాత్రమే స్టార్ హొటల్ అంకుల్” అంది వర్షిణి నవ్వుతూ.

వర్షిణికి లిమ్కా ఆఫర్ చేశాడు మాంటీ.

“ఇక్కడంతా టూరిస్ట్‌లతో బిజీ అయి, మనశ్శాంతి లేకుండా పోతుందని రోజూ ఎవరో ఒకరు బార్‌లో అనుకుంటూనే వున్నారు.

అందుకే ఎవరూ ఉద్యోగాల్లో చేరొద్దని తీర్మానిస్తారట” మాంటీ చెప్పడం ఆపాడు.

వర్షిణి నవ్వి వూరుకుంది.

వ్యాపారం అన్నాక ఇలాంటి అడ్డంకులు మామూలే! నిశాంత్ బిగ్ షాట్ కాబట్టి తట్టుకుని నిలబడగలడన్న నమ్మకముంది.

పైగా అతడికి గోవాలో కొందరు తెలుగు ఐ.ఏ.ఎస్. అధికార్లు బాగా తెలుసట.

వారు మంచి పొజిషన్‌లో వున్నారు.

కాబట్టి అన్నీ సాఫీగానే జరుగుతాయని మనసులో అనుకుంది.

బార్ నుంచి కొండ ప్రాంత్రంలో రోడ్డువెంట నడుస్తోంది వర్షిణి..... సన్నగా చిరుజల్లు మొదలైంది.

వెంటనే గొడుగు తీసింది.

కొండపైన బాట.

పింక్ కలర్ చుడీదార్, కాళ్ళకి కొల్హాపురి చెప్పులు సింపుల్‌గా వున్నా ఆ దృశ్యాన్ని చూస్తే క్లిక్ చేయాలన్పిస్తుంది.

స్పెయిన్ నుంచి వచ్చిన ప్రపంచ ప్రఖ్యాత ఫోటోగ్రాఫర్ గెరాల్డ్ తన నికాన్ కెమెరాలో బంధించాడు.

వర్షిణికి ఎదురయిన రవినాయక్ గుండె ఒక్కసారి జల్లుమంది.

వర్షిణిని చూస్తే చాలు- డాక్టర్ అయిన తనకు స్టెతస్కోప్ అవసరం లేకుండానే తన గుండె ఎంత స్పీడ్‌గా వుందో తెల్సిపోతుంది.

తన హృదయస్పందనలో తేడా తెల్సి ఈ.సీ.జీ. టెస్ట్ డబ్బులు మాత్రం మిగిలిపోతాయని నవ్వుకుంటూ వుంటాడు.

"హాయ్.... రవినాయక్....! సారీ ఖల్‌నాయక్...." పలకరించింది వర్షిణీ.

ఎమ్.ఎమ్. కీరవాణీ, ఏఆర్ రహమాన్, ఆర్.పి.పట్నాయక్, మణిశర్మ, చక్రీ, నదీమ్-శ్రవణ్....

అంతా కల్సి సంగీతం చేస్తే ఎంత మధురంగా వుంటుందో, అంత తీయనిగొంతు వర్షిణిది.

"ఖల్‌నాయకా? నేనే నాయకుడ్ని" అని అన్నాడు రవినాయక్.

మనసులో మాత్రం 'నీ సేవకుడ్ని' అనుకున్నాడు.

"ఏంటీ! ఇలా వచ్చారు? బైక్ ఏమయింది?"

"ఎం.పి.టి. క్వార్టర్స్‌లో పనుంది. సరదాగా వాకింగ్ చేస్తే హెల్త్, పెట్రోల్ వెల్త్ బాగుంటుందనీ."

"ఏం పని? గర్ల్‌ఫ్రెండ్ కోసమా?"

"గర్ల్‌ఫ్రెండా.....? నీకు తెల్సుగా వర్షిణీ! నాకు ఎవరూలేరని.... కనీసం ఇంటర్‌నెట్ ఛాటింగ్‌లో కూడా గర్ల్‌ఫ్రెండ్స్‌లేరు.

మడ్‌గావ్‌కర్ అనీ, వాళ్ళబ్బాయి సన్ అండ్ శాండ్‌లో సూపర్‌వైజర్‌గా చేరాడు.

నిన్న యిటుక వచ్చి భుజంపై పడిందట. పెద్ద గాయం కాదనుకో....."

"ఓహ్....! సన్ అండ్ శాండ్ అనగానే నిశాంత్ గుర్తొచ్చాడు. పొద్దున్న పదింటికి ఇంటర్వ్యూ.

పాస్‌పోర్ట్ ఫోటోలులేవు అర్జంటుగా డిజిటల్‌లో దిగాలి. బై....." అని వాస్కోకు బస్సు ఎక్కింది వర్షిణి.

చాలాసేపటిదాకా బస్సునే చూస్తూ– అలాగే నిలబడ్డాడు రవినాయక్.

అతడి మదిలో వర్షిణి గురించి ఒక ఆలోచన సడెన్‌గా కదిలింది. బస్సు కూడా మలుపులో సడెన్‌గా మాయమైంది.

"ప్చ్! బ్యాడ్ సెంటిమెంట్.... తను నాకు దక్కుతుందా?"

రవినాయక్ గుండె ఏ క్రషర్ లేకుండానే బద్ధలైపోతోంది.

రవినాయక్ కళ్ళజోడుతో రాముడు మంచి బాలుడులా వుంటాడు. తనంటే ఇష్టమని అతడి కళ్ళలోకి చూసి చెప్పవచ్చు.

చదువుకున్నవాడు.

బుద్ధిమంతుడు.

అతడికి ఎస్ అనొచ్చుగా?

కానీ ప్రేమభావం ఊటలా కలగాలి.

చెరువులా బలవంతంగా తవ్వికాదు.

అది ఎవరికి ఎవరు.....?

ఎక్కడ......?

ఎప్పుడు.....?

ఎలా.....?

ఏమో....!

అదే ప్రేమేమో!

× × ×

సన్ అండ్ శాండ్ హోటల్ నిర్మాణ ప్రాంగణంలో అందమయిన చిన్న గెస్ట్‌హౌస్.

అందులో ముందువేపు మొత్తం గ్లాస్‌లతో నిర్మించిన ఎయిర్ కండీషన్డ్ గదిలోపల ఎయిర్ కండీషనర్ మంద్రంగా శబ్ధం చేస్తోంది.

లక్ష ఖరీదు చేసే కుర్చీలో కూర్చుని, సెల్‌లో ఎవరితోనో మాట్లాడుతున్నాడు నిశాంత్.

బ్లాక్ ఫాంట్‌పై నేవీబ్లూ షర్ట్, లూయిస్ ఫిలింబ్రాండ్, చేతికి ఖరీదయిన రోలెక్స్ వాచ్.

ఎర్రని రంగుతో ఏ హీరోకి తగ్గని నిశాంత్ కాస్ట్‌లీ బ్రాండ్ వాడినా, వీలయినంత నమ్రతగా వుంటాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Prema+Kappulo+Chiru+Tufan**

* * *